జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



మంగళవారం | 20-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 344 పేజీలు: 4 వెల : రూ.7




* అధికారులకు.. ఇప్పుడు గుర్తుకు వచ్చినట్టుంది
* ప్రమాదం జరిగి ముగ్గురు చనిపోతే తప్ప స్పందించరేం?
* ఇటీవల గ్రానైట్ క్వారీలో ముగ్గురు కార్మికుల మృతి
* ఏకంగా కలెక్టర్, ఎస్పీ క్వారీ సందర్శన
* జిల్లాలోని క్వారీల్లో రెవెన్యూ, మైన్స్, పోలీసు అధికారుల తనిఖీ

# ఎన్నాళ్లకెన్నాళ్లకు!

**శ్రీకాకుళం క్రైం, మే 19 (వార్త):** జిల్లాలో వందకుపైగానే గ్రానైట్, తదితర క్వారీలు ఉన్నాయి. ఏ ఒక్క క్వారీని కూడా అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఒకవేళ వచ్చినా మొక్కుబడిగా చేసి చేతులు దులిపేసుకుంటూ పోతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఈ క్వారీల్లో కార్మికులు పడుతున్న ఇబ్బందులను కార్మిక సంఘాలు గొంతుచించి చెబుతున్నా ఏ ఒక్క అధికారి కూడా స్పందించిన దాఖలాలు లేవు. ఈ క్వారీల్లో అధిక భాగం అధికార నేతల అండదండలతో నడుస్తుండడమే కారణం కావచ్చు. మెళియాపుట్టి మండలం దీనబందుపురం సమీపాన దబ్బగూడ రెవెన్యూ పరిధిలోని మనీషా కూనపురెడ్డికి చెందిన వీఆర్‌టీ గ్రానైట్ క్వారీలో ఇటీవల ముగ్గురు కార్మికులు అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. దీంతో ఎవరు ఆదేశాలు ఇచ్చారో గాని ఏకంగా కలెక్టర్, ఎస్పీ,తో పాటు సంబంధిత శాఖల అధికారులు ఆ క్వారీని సందర్శించారు. మృతుల కుటుంబాలకు పరిహారం అందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆ గొడవ అక్కడితో నిలిచిపోయిందని కొందరు చెప్పకనే చెబుతున్నారు. ఇక జిల్లావ్యాప్తంగా ఉన్న క్వారీలను రెవెన్యూ, పోలీసు, మైన్స్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ఇదేదో ముందే తనిఖీలు చేపట్టి ఉంటే మెళియాపుట్టి మండలంలోని క్వారీలో ప్రమాదం అడ్డుకునే వారు కదా అని పలు కార్మిక సంఘాలు బహిరంగంగానే చెబుతున్నారు. టెక్కలి మండలంలో ఎక్స్‌ప్లోజివ్స్ లైసెన్స్ కలిగి ఉన్న పలు గ్రానైట్ క్వారీలను ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, సీఐ ఎ.విజయ్‌కుమార్ సోమవరం తనిఖీ చేశారు. క్వారీల్లో మైనింగ్ సేఫ్టీని పరిశీలించారు. అలాగే కొత్తూరు మండలంలోని దిమిలి, శోభనాపురం, రాయల వద్ద ఉన్న నాలుగు స్టోన్ క్రషర్లను తహశీల్దార్ కె.బాలకృష్ణ, వీఆర్వోలు, సర్వేయర్లు పరిశీలించారు. రాయిని పేల్చేందుకు లెసెన్స్ ఉన్న వారితో మాత్రమే బాంబు పేలుళ్లు చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే హిరమండలంలోని లోకొండ, శుభలయ గ్రామ పరిధిలోని స్టోన్‌క్రషర్లను తహసీల్దార్ హనుమంతురావు, ఎస్ఐ ఎండీ యాసిన్, ఆర్ఐ శంకరరావు తనిఖీ చేశారు. మెళియాపుట్టి మండలంలోని పద్ద రెవెన్యూ గ్రూపులో ఉన్న గ్రానైట్ క్వారీని తహసీల్దార్ బి.పాపారావు, ఎస్ఐ రమేష్‌బాబు, మైనింగ్ అధికారులు పరిశీలించారు. అయితే ప్రస్తుతం జిల్లాలోని గ్రానైట్ క్వారీలు మూతపడ్డాయి. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నారు. వారు ఇచ్చిన నివేదికలను అనుసరించి జిల్లా కలెక్టర్ ఏయే గ్రానైట్, స్టోన్‌క్రషర్ క్వారీలకు అనుమతి ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. అయితే కొందరు అధికార పార్టీకి చెందిన నేతలకు సంబంధించిన స్టోన్‌క్రషర్లు మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా క్రషర్లు నడుస్తునే ఉన్నాయి. నేతల అండదండలు ఉండడంతో మండల అధికారులు సైతం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.



# యూపీవీసీ విండో పరిశ్రమల.. గుట్టురట్టయ్యేనా?

*** అనుమతులు లేని వ్యాపారంతో సమాజానికి తీరని నష్టం * నిబంధనలు పాటించని యాజమాన్యాలు * శబ్ధ, వాయు కాలుష్యంతో ఇక్కట్లు * చోద్యం చూస్తున్న అధికారులు**

**శ్రీకాకుళం, మే 19 (వార్త):** ఒకప్పుడు ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన శ్రీకాకుళం నగరం ఇప్పుడు యూపీవీసీ విండో పరిశ్రమల విస్తరణతో ఊహించని పరిణామాలను ఎదుర్కొంటోంది. శివారు ప్రాంతాలైన ఎచ్చెర్ల ఇండస్ట్రియల్ ఏరియా, పెదపాడు ఆర్టీవో ఆఫీస్ రోడ్, పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు, ఇంకా జిల్లాలోని ప్రధాన ప్రాంతాలలో గత రెండేళ్లలో దాదాపు 50 నుండి 80 వరకు యూపీవీసీ విండో తయారీ యూనిట్లకు కేంద్రంగా మారాయి. పైకి అభివృద్ధిలా కనిపిస్తున్న ఈ విస్తరణ వెనుక మాత్రం అనేక చట్టవిరుద్ధ కార్యకలాపాలు, పర్యావరణానికి ముప్పు దాగి ఉన్నాయి.

## అనుమతులు గాలికి..

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ కొత్తగా వెలిసిన యూపీవీసీ తయారీ యూనిట్లలో 90 శాతానికి పైగా ఎటువంటి అనుమతులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. మునిసిపల్ కార్పొరేషన్ నుండి ట్రేడ్ లైసెన్స్ లేదు, కాలుష్య నియంత్రణ మండలి నుండి అనుమతి లేదు. అంతేకాకుండా, ఫ్యాక్టరీ చట్టాలు, కార్మిక చట్టాలను సైతం యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, సంబంధిత అధికారులు మాత్రం ఈ విషయంపై బహిరంగంగా స్పందించడానికి వెనుకాడుతున్నారు.

## శ్వాసకోశాలపై విష ప్రభావం..

యూపీవీసీ విండోల తయారీలో ఉపయోగించే రసాయనాలు, పీవీసీ కణాలు, గ్లూలు, సాల్వెంట్లు వంటివి అత్యంత ప్రమాదకరమైనవి. ఇవి గాలిలో కలిసి శ్వాసకోశ సంబంధిత సమస్యలకు దారితీస్తాయి. ముఖ్యంగా ఈ అనధికారిక వర్క్‌షాపులు నివాస ప్రాంతాల మధ్య ఉండటంతో, స్థానికులు దుర్వాసనతో కూడిన కలుషితమైన గాలిని పీల్చుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్న సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి.

## మునిసిపల్ అధికారుల నిస్సహాయత..

ఈ విషయంపై మునిసిపల్ అధికారులను సంప్రదించగా, వారు తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు. "చాలా మంది వ్యాపార ప్రారంభాల పేరుతో హడావుడిగా సిబ్బందిని నియమించుకుని, ఎటువంటి లైసెన్స్ లేకుండా పనులు మొదలుపెడుతున్నారు. వారిని గుర్తించి చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, వారు తరచూ తమ కార్యకలాపాల స్థలాన్ని మారుస్తూ అధికారులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారు," అని వారు తెలిపారు.

## భద్రత లేని శ్రామికులు

స్థానిక స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన పరిశీలనలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని యూపీవీసీ తయారీ కేంద్రాలలో బాల కార్మికులను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా, పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రతా చర్యలు కూడా లేవు. హెల్మెట్లు, గ్లోవ్స్, వ్యక్తిగత రక్షణ పరికరాలు లేకుండానే వారు ప్రమాదకరమైన రసాయనాలు, యంత్రాల మధ్య పనిచేస్తున్నారు. గాలిలో కలిసిపోయిన పీవీసీ ధూళి నేరుగా వారి ఊపిరితిత్తుల్లోకి చేరుతోంది.

## ధరల పేరుతో మోసం..

ఈ అక్రమ తయారీదారులు తక్కువ నాణ్యత గల ముడిసరుకును ఉపయోగించి, చట్టబద్ధంగా నడుస్తున్న పరిశ్రమల కంటే తక్కువ ధరలకు విండోలను విక్రయిస్తున్నారు. దీనివల్ల నిజాయితీగా వ్యాపారం చేస్తున్న కంపెనీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. వినియోగదారులు తక్కువ ధరలకు ఆకర్షితులవుతున్నప్పటికీ, వారు కొనుగోలు చేస్తున్న ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. భవిష్యత్తులో ఈ నాణ్యత లేని విండోల వల్ల అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

## ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం..

పరిశ్రమల నిపుణులు ఈ పరిస్థితికి ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపమే ప్రధాన కారణమని అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక శాఖ, మునిసిపల్ కార్పొరేషన్ సమన్వయంతో పనిచేయకపోవడం వల్లనే ఈ అక్రమ వ్యాపారాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఎవరికి వారు తమ పరిధిలోని సమస్య కాదన్నట్లు వ్యవహరించడం వల్ల బాధ్యతారాహిత్యమైన పరిస్థితులు నెలకొన్నాయి.

## కళ్లు తెరిస్తేనే భవిష్యత్తు..

నిస్సందేహంగా, ఉపాధి అవకాశాలు కల్పించడం ముఖ్యం. కానీ, పర్యావరణాన్ని విస్మరించి, చట్టాలను ఉల్లంఘిస్తూ సాగే ఇలాంటి అభివృద్ధి సమాజానికి చేటు చేస్తుంది. శ్రీకాకుళం నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అధికార యంత్రాంగం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. లేకపోతే, ఈ 'గుట్టు చప్పుడు కాకుండా పెరుగుతున్న కాలుష్యం' నగర అభివృద్ధికి ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోతుంది. సంబంధిత అధికారులు ఇకనైనా కళ్లు తెరిచి చర్యలు తీసుకుంటారా లేక ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతుందా అనేది వేచి చూడాలి.



## ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా మొజ్జాడ యుగంధర్

**శ్రీకాకుళం, మే 19(వార్త):** అఖిలభారత యువజన సమాఖ్య ( ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యునిగా జిల్లాకు చెందిన మొజ్జాడ యుగంధర్ నియమితులయ్యారు. తిరుపతిలో ఈ నెల 15 వ తేదీ నుంచి 18 వరకు జరిగిన జాతీయ మహాసభల్లో యుగంధర్‌ను ఎన్నుకున్నారు. గత ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల నుంచి రాష్ట్ర అధ్యక్షునిగా యుగంధర్ కొన సాగుతున్నారు. ఇప్పుడు జాతీయ కార్యవర్గంలో తొలిసారిగా శ్రీకాకుళం వాసికి అవకాశం దక్కింది. యుగంధర్ నియామకం పట్ల పలువురు జిల్లా యువజన, విద్యార్థి, కమ్యూనిస్టు నాయకులు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ తనపై మరింత బాధ్యత పెరిగిందని, యువజన సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఏఐవైఎఫ్ జాతీయ నాయకత్వానికి యుగంధర్ కృతజ్ఞతలు తెలిపారు.



# అర్జీలు పెండింగ్ లేకుండా చూడండి

**-పీజీఆర్ఎస్‌కు 75 వినతులు**

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, మే 19(వార్త):** అర్జీలు పెండింగ్ లో లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. 75 అర్జీలు స్వీకరించగా ఇందులో రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఎపి హౌసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామీణాభి వృద్ధి, వాటర్ రిసోర్సెస్, ఎడ్యుకేషన్, వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ తదితర శాఖలకు సంబం ధించి అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర రావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్ లు ఉండగా, ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 5 నుంచి 15 వరకు బీహార్ లో జరిగిన 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో జిల్లాకి చెందిన గుజ్జల వర్షిత వెయిటలిఫ్టింగ్ లో బంగారు పతకం, ఎస్ రామ్మోహన్ కబడ్డీలో కంచు పతకం సాధించి నందుకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వారిని అభినం దించారు.

# నందమూరి అభిమానులు సేవా తత్పరులు



**శ్రీకాకుళం, మే 19(వార్త):** నందమూరి అభిమా నులు సేవా తత్పురులని, ఎన్టీఆర్ అభిమానులు చేస్తున్న సేవలు అభినందనీయమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గ్లోబల్ స్టార్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ 42వ జన్మదినం సందర్భంగా నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ స్థానిక సరస్వతి థియేటర్ వద్ద ఎన్టీఆర్ అభిమానుల మధ్య కేక్ కట్ చేసినంతరం మాట్లాడుతూ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న చిత్రాలు ఆలోచింపజేస్తాయని, రాష్ట్ర నలుమూలల ఉండే ఆయన అభిమానులు చేస్తున్న సేవలు వర్ణించలేనివన్నారు. ఉచితవైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, చలివేంద్రాలు, క్రీడాపోటీలు, పేదవారికి ఆపన్నస్థులుగా నిలుస్తున్నారని ఆయన తెలియ జేశారు,శ్రీకాకుళం జిల్లా జూనియర్‌ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ దుంగ శ్రీధర్ ఆధ్వర్యంలో, పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు , శ్రీకాకుళం జిల్లా కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్ వైడ్ కన్వీనర్ బుర్రి మదు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జన్మదినాన్ని వారం రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అభిమానం చాటుకున్నారని, సేవలకు చిరునామగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ బృందం నిలుస్తుందని, దుంగ. శ్రీధర్ తోపాటు, కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్ వైడ్ కన్వీనర్ బుర్రి మదు ఆధ్వర్యంలో రానున్న రెండు, మూడు రోజులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. దుంగ శ్రీధర్, మధు మాట్లాడుతూ మా అభిమాన నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భముగా జిల్లాలో నాలుగు రోజులు పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటం జరుగు తుందని ఈ రోజు మధ్యాహ్నం యాచకులకు అన్నదాన కార్యక్రమము జరుగుతుంది అని 20 వ తేదీన బెహరా మనో వికాస కేంద్రం లో అనాథ పిల్లలు కు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నామని సామాజిక సేవ ఒక బాధ్యతగా తీసుకున్నామని, జూనియర్ ఎన్టీఆర్ పేరిట ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. సరస్వతి థియేటర్ మేనేజర్ చిన్న రాజు గారు శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఉపాధ్యకులు పి.గోవిందరావు, పి .శ్రీనివాసరావు, బొట్ట కామరాజు, %%. ప్రసాద్,బాడీ బిల్డర్ విజయ్,%ఖ%. గంగరాజు, అందవరపూ శ్రీనివాసరావు శ్రీనివాస కార్తిక్, సతీశ్,%ఎ% లక్ష్మణ్ రెడ్డి, బాస్కర్, ఈశ్వర్ ,ఇంటిశంకర్, %జష్ట్ర%.రమణ,కరణం సురేష్ కుమార్ సుభాష్ చౌదరి, జగదీష్,మట్ట రాజు, అల్లక మల్లికార్జున టీం తారక్ ట్రస్ట్ సభ్యులు వాసుపల్లి నరసింహ మూర్తి, మోఖర షణ్ముఖ,నేతాజీ, ప్రకాష్,సురేష్, తారక్, పోలీస్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు, నందమూరి అభిమానులు పాల్గొని ఎన్టీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా స్టార్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ నిర్వహిస్తున్న బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమము లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ గారి అభిమానులు నందమూరి అభిమానులు పాల్గొన్నారు

# కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళులు



**కొత్తూరు, మే 19(వార్త):** కొత్తూరులో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభ జరిగింది.ఈ సభలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం నాయకులు యన్.అప్పన్న అద్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో అగ్రగణ్యుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత,వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వతంత్ర భారత పార్లమెంటు లో మొదటి ప్రతిపక్ష నాయకుడు, భారత విప్లవోద్యమ పథ నిర్దేశకుడు, సిపిఐ(యం) మొదటి జాతీయ ప్రధానకార్యదర్శి కామ్రేడ్ సుందరయ్య సేవలు మరుపురానివని తెలిపి, వారికి విప్లవ జోహార్లు అర్పించారు. అలాగే సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిర్ల ప్రసాద్ అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, పి క్రిష్ణ, యస్ సింహచలం, మొఖలింగం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**పలాస, మే 19(వార్త):** పలాస-కాశీబుగ్గ సిపిఎం కార్యాలయంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు ఎన్ గణపతి, తెప్పల అజయ్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పుట్టుకతో ధనవంతుడుని, సమాజంలో జరుగుతున్న అసమానతలు తట్టుకోలేక పేదల కోసం తన ఆస్తిపాస్తులను దారాదత్తం చేశారని గుర్తు చేశారు. ఎంపిగా పని చేసిన సమయంలో సైకిల్ పై పార్లమెంటుకు వెళ్ళి పేదల కష్టాలు నష్టాల పై గలం ఎత్తిన నాయకులని కొనియాడారు. కార్యక్రమంలోపలాస డిఓ ఉమా మహేశ్వర రావు, డిల్లీశ్వరి, తెప్పల సత్యవతి, కె సుహాసిని పాల్గొన్నారు.





## ఏ సమస్య ఉన్నా సంప్రదించండి

**-కమిషనర్ రామారావు**

**పలాస, మే 19(వార్త):** ఏ ప్రాంతంలో ఏ సమస్య ఉన్నా తనని నేరుగా సంప్రదించాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్ )కార్యక్రమం ను పలాస-కాశీబుగ్గ పుర పాలక సంఘం కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో త్రాగునీటి కొరకు, జనన మరణ సర్టిఫికెట్లు కొరకు, వితంతు పెన్షన్లు, ఆస్తి పన్ను పేరు మార్పు కొరకు పలు సమస్యలపై మొత్తం 10 దరఖాస్తులు రాగా అందులో జనన మరణ సర్టిఫికెట్ల కొరకు 6, వితంతు పెన్షన్ కొరకు -1, త్రాగునీటి సరఫరా కొరకు-2, ఆస్తి పన్ను పేరు మార్పు కొరకు - 1 దరఖాస్తులు అందినట్లు మున్సిపల్ కమిషనర్ తెలియజేసారు. ఈ పురపాలక సంఘంలో మంచినీటి సమస్య ఎక్కడైనా ఉన్న తనను నేరుగా సంప్ర దించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



**మందస, మే 19(వార్త):** ప్రకృతి వ్యవసాయంపై రైతులందరూ పూర్తి అవగాహన పొందాలని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మా రావు తెలిపారు. మందస పంచాయతీలో గల చిన్నబరంపురంలో మందస సర్పంచ్ ప్రతినిధి చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, గ్రామ పెద్దలు మెట్ట మహేష్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ రైతుల అవగాహన ర్యాలీ అనంతరం నవధాన్యాల సాగు అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాన పంటతో పాటు ఈ నవధాన్యాల మొక్కలు పొలంలో పుట ్టడంతో పైరుకు మేలు చేసే సూక్ష్మజీవులు, వాటి వేళ్లు ద్వారా నేల గుళ్ల బారి వాన పాములు లాంటి మిత్ర పురుగులు అభివృద్ధి చెందుతాయని వివరించారు. రసాయనాలను బాగా తగ్గించాలని , క్రిమిసంహారక మందులకు బదులు ఘన జీవామృతం, గోమూత్రంతో కూడిన వేప, సీతాఫలం మొదలగు కషాయాలే పంటల అభివృద్ధికి ముద్దని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతు లను అవలంబిస్తున్న ముగ్గురు రైతులను గుర్తించి సర్పంచ్ ఆధ్వర్యంలో సన్మానిం చారు కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు మెట్ట శారద, క్లస్టర్ కోఆర్డి నేటర్ స్వామినాయుడు, వి.వో.ఏ. నాగమణి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృపాసింధు, లక్ష్మణరావు, బాలకృష్ణ, భారతి, కరుణ, కళ్యాణి, ప్రసాద్, లక్ష్మీనారా యణ, అగ్రికల్చర్ ఆఫీసర్ జి.నాగరాజు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## చెక్ డ్యాంకు గ్రాంట్ మంజూరు చేయండి




**కొత్తూరు, మే 19(వార్త):** కొత్తూరులో 900 ఎకరాల సాగుకు హడ్డుబంగి గెడ్డ ద్వారా వచ్చె నీరే వ్యవసాయనికి ఆధారం .గత కొద్ది సంవత్సరాల క్రితం వచ్చిన తితిలి తుఫాన్ వల్ల హడ్డుబంగి గెడ్డ పూర్తిగా పాడై పోవడంతో దాదాపు ఐదు గ్రామాల పంటపొలాలకు సరిగా నీరు అందకపోవడంతో ఈ చుట్టుపక్కల రైతులు టిడిపి నాయకులు,మండల వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసి వరప్రసాద్ రావు దృష్టికి తీసుకెళ్లగా అప్పటి నుండి ఇప్పటి వరకు ఆయన సొంత నిధులతో తాత్కాలిక మరమ్మత్తులు చేస్తూ రైతులకు వ్యవసాయానికి ఎటువంటి లోటు లేకుండా చేశారు. అలాగే ఈ సంవత్సరం కూడా ఇటీవల రైతులందరూ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు గారిని కలిసి అక్కడ ఉన్న భూములకు సాగునీరు లేక పంటలు లేక తాము ఎంతో ఇబ్బంది పడుతున్నామని, రైతుల సమస్యలను మీ వద్దకు తీసుకొచ్చామని ఆయన వద్ద తెలిపి ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చెయ్యాలని కోరారు. ఈ సంవత్సరం రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా హడ్డుబంగి గెడ్డ కు తాత్కాలికంగా రైతులతో కలిసి ఇసుక బస్తాలతో చెక్ డ్యాం నిర్మాణం చేపట్టడం జరిగింది. అయినప్పటికీ రైతులకు శాశ్వత పరిష్కారం చెయ్యాలని భావనతో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మరియు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కి కలిసి వినతి పత్రం అందజేశారు. అయితే వెంటనే కలెక్టర్ స్పందించి ఈ యొక్క చెక్ డ్యాం కొరకు త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 22న హరిపురంలో ప్రత్యేక జాబ్ మేళా

**మందస, మే 19(వార్త):** మందస మండలంలోని హరిపురంలోని శాతవాహన జూనియర్, డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఫార్మాకంపెనీల్లో ఉద్యోగాలకై ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. హైదరాబాదులో పని చేయాల్సి ఉంటుందని, 18-25 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. డిగ్రీ బీఎస్సీ-కెమిస్ట్రీ(పాస్/ఫెయిల్)/బికాం, ఇంటర్ ఎంపీసీ/బైపీసీ/ఫార్మాటెక్/ఒకేషనల్ గ్రూపులు, డిప్లొమా/ఐటీఐ కలిగి ఉండాలని, 2020, 2021, 2022, 2023, 2014, 2025 పాస్ అవుట్స్ మాత్రమేనని నిర్వాహకులు తెలిపారు. 22న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయన్నారు. అదేవిధంగా 21న పాలకొండలో శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల, 24న విశాఖపట్నంలోని సీఎంఎస్ లేబరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 25న విజయనగరంలోని ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో కూడా ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 8142194787, 6303204295 అనే ఫోన్ నంబర్లుకు సంప్రదించాలని వారు కోరారు.



## స్నేహ పూర్వకంగా క్రీడాకారులు ఉండాలి

**పలాస, మే 19(వార్త):** స్నేహపూర్వకవాతావరణంలో క్రీడాకారులు ఉండాలని, క్రీడల్లో ఐకృత చెప్పాలని వైసిపి పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ అన్నారు. సోమవారం పలాస-కాశీబుగ్గ పట్టణంలో సూదికొండ కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. 19వ వార్డు పరిధి సూదికొండ పరిసర ప్రాంతం యువకులు కొండమ్మతల్లి ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) తరుపున 5 క్రికెట్ జట్లుగా ఏర్పడి పోటీ పడుతున్నాయి. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న సందర్భంగా కేపీఎల్ క్రికెట్ క్రీడోత్సవంలో భాగంగా మొదటి మ్యాచ్ ను ఆడుతున్న ఇరుజట్లు మధ్య టాస్ వేసి కేపీఎల్ ను ప్రారంభించిన వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ ఈసందర్భంగా శిష్టు.గోపీ మాట్లాడుతు టోర్నమెంట్ ను స్నేహపూర్వకవాతావరణంలో యువకులు అందరూ కలిసి-మెలిసి ఎటువంటి గొడవలు పడకుండా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ నిర్వహించి గ్రామానికి మంచి పేరు వచ్చే విదంగా మెలగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూదికొండ యువకులు, క్రికెట్ క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## 108లో సుఖ ప్రసవం



**మందస, మే 19(వార్త):** మందస మండలంలోని బుడారిసింగి గ్రామానికి చెందిన ఆరిక ఢిల్లేశ్వరి అనే మహిళకు పురిటినొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మందస 108 అంబులెన్స్ ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ మరడ రామచంద్రారెడ్డి హుటాహుటిన బుడారిసింగి చేరుకున్నారు. ఢిల్లేశ్వరిని 108లో ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో దారిలో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో డాక్టర్ల సలహా, సూచనల మేరకు ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ మరడ రామచంద్రారెడ్డి సమన్వయంతో 108 వాహనంలో కాన్పు చేశారు. మగ బిడ్డకు జన్మనిచ్చిన ఢిల్లేశ్వరి సురక్షితంగా ఉండడంతో ఆమె కుటుంబ సభ్యులు ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ మరడ రామచంద్రారెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తల్లి, బిడ్డలను 108 వాహనంలోనే హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

## మాతృభాష తెలుగు ఎంతో ముద్దు

**మందస, మే 19(వార్త):** ప్రతీ ఒక్కరూ తెలుగును తప్పక నేర్చుకోవాలని, మాతృభాష ఎంతో ముద్దని మందస శాఖా గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె. విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు తెలుగు వ్యాకరణాలపై ప్రత్యేక తరగతులను మందసలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగుభాష ఎంతో విలువైనదని, మనమంతా తెలుగువారమని, తప్పక తెలుగు మాట్లాడాలన్నారు. ప్రపంచభాషల్లో కూడా తెలుగుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనంతరం వివేకానంద విద్యానికేతన్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు కుసుమకుమారి విద్యార్థులకు తెలుగు భాష, ప్రాధాన్య, వ్యాకరణం, సంధులు, సమాసాలు వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.




# జీరో సైన్స్ ల్యాబ్ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం

- విద్యార్థులకు ఈ ప్రాజెక్ట్ ఎంతో ఉపయోగకరం
- ప్రాథమికంగా 20 పాఠశాలల్లో అమలు
- ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, మే 19(వార్త):** కేంద్ర విద్యాశాఖ అనుబంధ సంస్థ ఏఐసీటీఈ ఆమోదించిన జీరో సైన్స్ ఇంటరాక్టివ్ డిజిటల్ ల్యాబ్స్ ఇప్పుడు శ్రీకాకుళం నియోజకవర్గం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతో, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అనుమతితో అమలు చేయడానికి ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో పైలట్ ప్రాజెక్ట్ ఎంతో ఉపయోగకం మని, విద్యార్థులందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం, ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను చేరుకోవాలనే దృఢసంకల్పంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. ఎడ్జ్ వన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాంకుమార్ రామదేవు మాట్లాడుతూ సుమారు 5 సంవత్సరాల పరిశోధన ఫలితంగా, విద్యార్థుల్లో గణితం, సైన్స్ పట్ల భయం పోగొట్టి ఆసక్తిని కలిగించేలా ఈ జీరో సైన్స్ ల్యాబ్‌ను రూపొందించామన్నారు. మా ఈ ప్రయాణంలో మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఒరాకిల్ సంస్థల ప్రోత్సాహం మాకు ఎంతో సహాయపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెర్వా యింట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అధ్యక్షులు సత్యసాయి సంతోష్ పాల్గొన్నారు.

# పలాస కిడ్నీ హాస్పిటల్లో పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు కల్పించాలి



**పలాస, మే 19(వార్త):** పలాస కిడ్నీ హాస్పిటల్లో పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు కల్పించాలని బిజెపి నాయకులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. విజయవాడ భారతీయ జనతా పార్టీ ఆఫీస్ లో వైద్య ఆరోగ్య శాఖా మాత్యులు సత్యకుమార్ యాదవ్ ను కలసి పలాస 50 పడకల గవర్నమెంట్ ఆస్పత్రిలో ఆనస్తీషియా , ఈ ఎన్ టి, ఆప్తల్, ఎంబిబిఎస్ వైద్యులు, ఎన్ సిడి మెడికల్ ఆఫీసర్, ఖాళీగా ఉన్నవి వాటిని సత్వరమే నియమించాలని, హాస్పిటల్ లో పేషెంట్స్ కు బెడ్స్ కొరతగా ఉన్నందున కొత్త బెడ్స్ ను సత్వరమే ఏర్పాటుచేయాలని, అసంపూర్తిగా ఉన్న సివిల్ వర్క్స్, ప్రహరీగోడ వెంటనే చేపట్టాలని మంత్రి దృష్టి తీసుకువచ్చారు. కిడ్నీహాస్పిటల్ కు సంబంధించి పూర్తి ఇన్ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చాలని వినతి పత్రం అందజేశారు. మంత్రి స్పందించి వీలైనంత తొందరగా అన్నీ ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం గారు,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠ రావు, బీజేపీ సీనియర్ నాయకులు కంచరాన బుజ్జి, పలాస కాశీబుగ్గ పట్టణ బీజేపీ అధ్యక్షులు పొట్నూరు తారకేశ్వర రావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సింగుపురపు వెంకట రమణ పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం తగదు

**శ్రీకాకుళం, మే 19(వార్త):** ప్రజా ఫిర్యాదులు స్వీకరణ మరియు పరిష్కారం కార్యక్రమంలో వచ్చే ప్రజా పిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గారు పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.చట్ట పరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ కె.వి.మహేశ్వర రెడ్డి గారు 50 మంది ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు.ప్రజా పిర్యాదులు పట్ల అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు.ఈ క్రమంలో జిల్లా ఎస్పీ గారు స్వయంగా వృద్దులు వికలాంగుల అర్జీ దారులు తో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి గారు అధికారులు ఆదేశించారు. పిర్యాదులు వివరాలు మొత్తం 50 స్వీకరించగా అందులో కుటుంబ సమస్యలు, మోసపూరితమైన, ఆస్తి తగాదాల, సివిల్ ఇతరత్రా అంశాలపై స్వీకరించా.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**పలాస, మే 19(వార్త):** పలాస– కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి చెందిన తాళభద్ర రైల్వేగేట్ సమీపంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్నిస్థానికులు గుర్తించారు. ఈ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ఆసుపత్రికి తరలించారు. మృతుడు శరీరంపై నీలపు రంగు జీన్ ప్యాంటు, టి షర్టు ధరించి ఉన్నారని పోలీసు తెలిపారు. ఎస్ఐ సంజీవరావు దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. కాగా మృతుని వివరాలు తెలియవలసింది.

# ఇచ్ఛాపురం టీడీపీ అధ్యక్ష పీఠం కోసం హెూరాహెూరీ

**ఇచ్ఛాపురం, మే 19(వార్త):** ఇచ్ఛాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పీఠం కోసం తెలుగు తమ్ముళ్లు హెూరా హెూరీ గా ప్రయత్నం చేస్తున్నారు. సుదీర్ఘకాలం పట్టణ తెలుగుదేశం అధ్యక్షునిగా కాళ్ళ ధర్మారావు పనిచేస్తున్నారు. ఇటీవలి పొలిటి బ్యూరో సమావేశంలో అ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సూచనల మేరకు ఎవరైనా మండల స్థాయి ,పట్టణ స్థాయి, గ్రామస్థాయి పదవుల్లో వరుసగా రెండుసార్లు లేదా ఆరేళ్లపాటు పని చేసి ఉంటే వారిని తప్పించి ఆస్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ప్రస్తుతం పనిచేసిన అధ్యక్షులకు అంతకంటే ఉన్నత స్థానం లేదా కొద్దిరోజులు విశ్రాంతి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయంతో అధ్యక్ష పీఠం మార్పు అనివార్యం అయింది. ఇప్పుడు ఇదే పట్టణమంతా హాట్ టాపిక్ గా మారింది .దాదాపు దశాబ్ది కాలానికి పైగా కాళ్ళ ధర్మారావు అధ్యక్షులు గా కొనసాగుతున్నారు .ఇతన్ని అధ్యక్ష స్థానం నుండి మార్చేందుకు ఎవరు సాహసం చేయలేకపోతున్నారు. గతంలో ఒకసారి ఓటింగ్ నిర్వహించగా అప్పటి పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జు జగన్నాథ రెడ్డికి 27 మంది సభ్యులకు గాను 19 మంది చేతులెత్తి బహిరంగంగా మద్దతు తెలిపారని సమాచారం. ఉదయానికల్లా సీను తారుమారైనట్లు సమాచారం. దీంతో మళ్లీ ధర్మారావుకే అధ్యక్ష పీఠం వరించింది. గిలాయి అప్పారావు తర్వాత సాలిన మామయ్య అధ్యక్షునిగా పనిచేశారు. వీరిద్దరిని మినహాయిస్తే అధిక శాతం ఆ పదంలో కొనసాగింది ధర్మారావు మాత్రమే. పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయంతో ఈసారి సీటు మారే పరిస్థితి కనిపిస్తుంది. దీంతో తెలుగు తమ్ముళ్లు ఎలాగైనా అధ్యక్ష పీఠం కైవశం చేసుకోవాలని ఎవరి స్థాయిలో వారు ఒత్తిడిలు చేపడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నంతకాలం ధర్మరావు సేవలందించారని అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయనే కొనసాగిస్తే బాగుంటుందని కొంతమంది దిగువ శ్రేణి నాయకుల అభిప్రాయమైనప్పటికీ ఈసారైనా కొత్త వారికి అవకాశం ఇస్తే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం జెండా ఎగరవేయవచ్చునని ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులే బహిరంగంగా చెబుతున్నారు. 1987 నుండి ఇప్పటివరకు కేవలం ఒక్కసారి మాత్రమే మున్సిపాలిటీని తెలుగుదేశం కైవసం చేసుకుంది. మిగిలిన ఐదు పర్యాయాలు కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు మాత్రమే పీఠాన్ని పదిలపరుచుకుంటున్నాయి. అధ్యక్ష పీఠానికి,



పత్రి తవిటయ్య




నందికి జానీ

మున్సిపల్ పీఠానికి ముడి పెడుతున్నారు. ఇటీవల పార్టీ సంస్థాగత వార్డు ఎన్నికల్లో భాగంగా పురుషోత్తపురం మినహా అన్ని వార్డులు పూర్తి చేశారు .తర్వాత పురుషోత్తం జాబితాన్ని కూడా యజ్ఞం కారణంగా ఆలస్యం కావడంతో అందజేశారు. బెల్లుపడా 12వ వార్డు కమిటీ విషయంలో తెలుగు తమ్ముల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రస్తుత వార్డు ఇంచార్జి ఆ పార్టీ రాష్ట్ర బీసీ రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ కొండ శంకర్ రెడ్డి వేసిన జాబితాలో ఇటీవల పార్టీలో చేరిన గిన్ని వెంకటరమణ( చిన్న) పేరు లేకపోవడంపై ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. అయితే పార్టీలో చేరిన ఏడాదిలోపే విద్యా కమిటీ చైర్మన్, నీటి సంఘం డైరెక్టర్, వంటి రెండు పదవులు ఇచ్చారని మిగిలిన వారికి వార్డ్ కమిటీలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. బెల్లుపడకు త్వరలో రానున్న ఆధార్ కేంద్రాన్ని కూడా ఇదే కుటుంబానికి ఇచ్చే యోచన లో ఉందని, ఈ విషయమై పార్టీలో పనిచేసిన ఇతర కార్యకర్తలకు గుర్తింపుని ఇవ్వాలని కొండశంకర్ వర్గం వాగ్వాదానికి దిగింది. ఈ నెల27, 28న కడపలో పార్టీ మహానాడు నిర్వహిస్తుంది. మహానాడులోగా కమిటీలు పూర్తి చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ కు పెద్ద శిరోభారంగా మారింది. ప్రస్తుత పార్టీ ప్రధాన కార్యదర్శి నందికి జానీ , ఏ ఎస్ పేట మూడో వార్డు కౌన్సిలర్ పత్రి తవిటయ్య పట్టణ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నారు. మైనార్టీలకు అవకాశం ఇస్తే తన పేరు పరిశీలించాలని బత్తిన కృష్ణయ్య కోరుతున్నారు. ప్రస్తుత అధ్యక్షులు యాదవ సామాజిక వర్గం కావడంతో మరోసారి ఆ పదవిని అదే సామాజిక వర్గం చెందిన వ్యక్తికి ఇస్తే సమతుల్యంగా ఉంటుందని ఆరో వార్డు కి చెందిన కోర్రాయి ధర్మరాజు కూడా పదవి ఆశిస్తున్నారు .మరి కొంతమంది కూడా అధ్యక్ష పీఠం పై ఆశతో ఉన్నారు .కానీ బహిరంగంగా అడగడం లేదు అని తెలుస్తోంది. కేవలం ఎమ్మెల్యే వద్దనే తమ అభిప్రాయం వెల్లడిస్తున్నట్లు సమాచారం. అయినప్పటికీ ప్రధాన పోటీ నందికి జానీ ,పత్రి తవిటయ్య ల మధ్యలో ఉంది .వీరిద్దరు కూడా గతంలో పార్టీలు విభేదించి ఇండిపెండెంట్ ల గా పోటీ చేసి తిరిగి తెలుగుదేశం పార్టీలో కొనసాగిన కుటుంబాలే కావడం విశేషం.ఒకవేళ జాని కి అధ్యక్ష పదవి ఇస్తే ప్రధాన కార్యదర్శి పదవి యాదవ సామాజిక వర్గానికి ఇవ్వాల్సి ఉంటుంది. అధ్యక్ష పదవి పత్రి తవిటయ్య కు ఇస్తే నందికి జానీ ని కార్యదర్శి పదవి నుంచి తప్పించాల్సి ఉంటుంది. కారణం జానీ కూడా ఇదే పదవిలో ఆరేళ్లపాటు పనిచేశారు. జానీ దూకుడు స్వభావం పై కొంతమంది పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలుస్తోంది. జానీ మేనమామ ఆసి బాలయ్య రెడ్డి కుటుంబం అశోక్ తండ్రి బెందాలం ప్రకాష్ హయాం నుండి సత్సంబంధాలుతో కొనసాగుతోంది.తవిటయ్య పార్టీకి ఆర్థికంగా , అండగా నిలుస్తారని కొంతమంది భావిస్తున్నారు. ఈనెల 20 న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్టీ మినీ మహానాడు నిర్వహిస్తుంది. ఈ లోగా పట్టణ కమిటీని పూర్తి చేయాల్సిన బాధ్యత ఉంది. ఇప్పటికే జానీ తెలుగుదేశం పార్టీ స్థూపాన్ని బస్టాండ్ లో నిర్మించారు. ప్రస్తుతం హెూరా హెూరీ గా సాగుతున్న అధ్యక్ష పీఠం పోటీలో ఎవరిని వరిస్తుందో వేసి చూడాలి.


# వాతావరణ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**శ్రీకాకుళం, మే 19(వార్త):** భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తో కలిసి జిల్లా అధికారులతో ఆయన మాట్లాడుతూ పిడుగు పాటుకు సంబంధించి వాతావరణ శాఖ నుండి సమాచారం అందిన వెంటనే గ్రామ స్థాయిలో చేరే విధంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని తద్వారా జిల్లా అధికారులు తెలుసుకోవాలన్నారు. వ్యవసాయ, పశు సంపద, తోటలు, చెట్లు పడిపోవడం, విద్యుత్ లైన్లు దెబ్బ తినడం వంటి సమాచారం పై సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయ, పశు సంవర్ధక మత్స్య, ఉద్యానవన, విద్యుత్, రహదారులు మరియు భవనాల శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వాతావరణ హెచ్చరికలు వచ్చిన వెంటనే సంబంధిత గ్రామాల్లో దండోరా, ప్రార్థనా స్థలాల్లో అందుబాటులో ఉన్న లౌడ్ స్పీకర్లు ద్వారా అనౌన్స్ చేయాలన్నారు. గత కొద్ది రోజుల్లో పశువులు, మనుషులు పిడుగుపాటుకు గురయ్యారని, అలాంటివి పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. పిజిఆర్ఎస్ ప్రారంభానికి ముందు జిల్లా అధికారులతో పెండింగ్ లో పిజిఆర్ఎస్ పై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వారసత్వ భూమితో రెవెన్యూ అధికారుల ఆటలు


తేదీ: 19-05-2025
శ్రీయుత తహసిల్దార్,
సంతబొమ్మాళి మండలం,
శ్రీకాకుళం జిల్లా వారికి.
అయ్యా!
... CREMATION CERTIFICATE, DEATH CERTIFICATE ...

**సంతబొమ్మాళి, మే 19(వార్త):** అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ భూమిని ఒకరి పేరు మీద నుంచి ఇంకొకరు పేరు మీద మారుస్తూ రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అసలు బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు డబ్బులు తీసుకొని ఈ తతంగమంతా నడిపిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. తహసిల్దార్ కార్యాలయం నుండి చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు ముడుపులు తీసుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇటీవలి ఓ సంఘటన.మండలంలో కాశీపురం గ్రామానికి చెందిన అట్టాడ భానుమతి సంబంధించి వారసత్వ ఆస్తులపై కుమార్తెనైనా నన్ను కనీసం సంప్రదించకుండా ఇతరుల పేరున ఎలా నమోదు చేశారని తహసిల్దార్ హేమసుందర్‌కు సోమవారం దిక్కల సుమతి ఫిర్యాదు చేశారు. తన తల్లి భానుమతి ఏడేళ్లుగా తన వద్దనే ఉన్నదని గత నెల 22న అనారోగ్యంతో మృతి చెందిందన్నారు. ఈమె పేరున కాశీపురం, బృందావనం, కోటపాడు గ్రామాల్లో సుమారు 13 ఎకరాల భూమి ఉన్నది. డెత్ సర్టిఫికెట్ ,లీగల్ హెయిర్, ఎఫ్ఎంసి సర్టిఫికెట్లు ఇవ్వకుండా నా తమ్ముళ్ళైన అట్టాడ జనార్దన్ రావు, అట్టాడ చక్రవర్తి, అతని భార్య అట్టాడ సునీత పేరున ఏ విధంగా భూమిని బదలాయించారని అన్నారు. వారి పేరున -బి లు వస్తున్నాయని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూమిని తనను కనీసం సంప్రదించకుండా, నా సంతకం లేకుండా ఏ విధంగా ఇతరుల పేరున నమోదు చేశారని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఇక్కడ న్యాయం జరగక పోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.





## ప్రతి ఇంటికి మంచినీటి సరఫరాకు చర్యలు

**పలాస, మే 19 (వార్త):** ఉద్దానం ప్రాజెక్ట్ నుంచి, పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘానికి ఇటీవలే ప్రభుత్వం కేటాయించిన 5 ఎమ్. ఎల్. డి. మంచినీటిని జంట పట్టణాలలో అన్ని వార్డులకు, అన్ని వీధులలో కూడా సరఫరా చేసే విధంగా ప్రణాళికను రూపొందించటానికి వీలుగా ఏర్పాటు చేయాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో ఏ.ఈ. లు, సచివాలయం ఎమినిటి కార్యదర్శులు, ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ వాటర్ సప్లై సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ శాసనసభ్యులుగౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశానుసారం జంట పట్టణాలలో అన్ని వార్డులకు మంచినీటి పైపులైన్లను, ఇంటింటికి మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయడానికి తగ్గట్టుగా సర్వేలను చేసి ప్రణాళికలను ఈ కార్యాలయమునకు అందజేయవలసిందిగా ఏ ఈ లను, కార్యాలయ సిబ్బందిని, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే నిరంతరం మంచినీటిని దశలవారీగా ఇంటింటికి ఇవ్వటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ కిరణ్, సచివాలయం లోని కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గుండె గు'బిల్లు'



**సంతబొమ్మాళి, మే 19(వార్త):** కరెంటు వైర్లు ముట్టుకోవాల్సిన పనిలేదు




కరెంట్ బిల్లు పట్టుకుంటే చాలు షాక్ కొడుతుందని విద్యుత్ విని యోగదారులు అంటు న్నారు. ఏప్రిల్ నెలలో బిల్లులు చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత నెల కంటే చార్జీలు రెట్టింపు కావడంతో మండిపడుతున్నారు. కరెంటు చార్జీలు పెంచబోమని ప్రభుత్వం చెపుతుంటే బిల్లులు మోత మోగించడం ఏంటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఈక్రమంలో సంతబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న టీ కొట్టు యజమాని జమునా కి సాధారణంగా రూ. వెయ్యి లోపు ఎప్పుడు వచ్చే కరెంటు బిల్లు ఏప్రిల్ నెలలో ఒక్కసారిగా రూ. 4502 బిల్లు ను చూస్తే షాక్ కొట్టినట్లు అనిపించింది. దీంతో అవాక్కైన జమున ఏం చేయాలో తెలియక విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి అడిగే ప్రయత్నం చేయగా అధికారులు ఎవరూ స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వివరాలు తెలిపి బిల్లు సరి చేయాలని ఆమె కోరుతున్నారు.

## నౌపడలో వికసించిన 'మే' పుష్పం

**సంతబొమ్మాళి, మే 19(వార్త):** నౌపడలో సర్పంచ్ పిలక బృందాదేవి, మాజీ సర్పంచ్ పిలక రవి కుమార్ రెడ్డి ఇంటి ఆవరణలో చూపరులకు కనువిందు చేసే అరుదైన "మే" పుష్పం విరబూసి కనువిందు చేసింది. కేవలం మే నెలలో మాత్రమే వికసించే 'మే' పుష్పాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఫుట్‌బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ గా చూడటానికి ఎర్రటి బంతిలా ఆకుట్టుకునేలా ఉంటుంది. దీనినే స్థానికంగా భారత దేశంలో "మే" పుష్పంగా పిలుస్తుంటారు. ఎండలు విపరీతంగా ఉన్నపుడు అంటే ఏప్రిల్, మే నెలలో పూస్తుంది. కనుకనే దీనిని మే పుష్పంగా పిలుస్తారు. ఇది లిల్లీ జాతికి చెందిన దుంపరకం మొక్క. ఒక్కసారి నేలలో పాతితే చనిపోవడమంటూ ఉండదు. నెమ్మదిగా పిలకలు వేస్తూ విస్తరిస్తూనే ఉంటుంది. ఎంత వేడిగా ఉంటే అంతగా ఇది పూలతో వికసిస్తుంది. మొగ్గ పువ్వుగా విచ్చుకోవడానికి సుమారు 20రోజులు పడుతుంది. ఒకటిన్నర నుంచి రెండు అడుగుల ఎత్తు ఉండే ఈ మొక్క తక్కిన కాలమంతా పచ్చని వెడల్పులాంటి ఆకులతో అలరిస్తుంది. వీటి పూవులను ఫ్లవర్‌వాజ్‌గా పెట్టుకోవడానికి అందంగా ఉంటుంది. దీనికి ఉండే మరో ప్రత్యేకత ఈ దుంపలు ఎంత పాత అయితే పూవు అంత పరిమాణం పెరుగుతుంది. మొదటి యేడాదికంటే రెండవ యేడాది పూవు పరిమాణం గణనీయంగా పెరుగుతుంది. ఇది ఇసుక నేలలో బాగా పెరిగి రోజులో నాలుగు గంటల పాటు ఉంటుంది. ఇటువంటి ప్రత్యేకమైన, అరుదైన పుష్పం తమ ఇంట్లో వికసించడం తో సర్పంచ్ పిలక బృందా దేవి, మాజీ సర్పంచ్ రవికుమార్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546